సాక్షి
ప్రకాశం
ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



ఈదురుగాలుల బీభత్సం

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉరుములు మెరుపులతో పలుచోట్ల వర్షం పడింది. - IIలో..



బాబు మాటలకు జనం నవ్వుకుంటున్నారు

వెలిగొండ ప్రాజెక్టుపై చంద్రబాబు మాటలకు జనం నవ్వుకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. - IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37 /24

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.





ఒంగోలులో సందేశం ఇస్తున్న ముస్లిం మతపెద్ద



ఒంగోలు ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు

అల్లా కరుణ కోసం..

ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని జిల్లాలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. బంధువులు, స్నేహితులతో విందులు ఏర్పాటు చేశారు. తమ శక్తికొద్దీ దానధర్మాలు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



ప్రార్థన చేస్తున్న చిన్నారి

అప్రమత్తతే... ఆయుధం



గ్యాస్ బాయ్‌లకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ వెంకట్రావు

- ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ చర్యలు
- అవగాహనా సదస్సులు
- అందుబాటులో వాహనాలు
- ఏటా తగ్గుతున్న ప్రమాదాలు

ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. ఎండలు సైతం దంచి కొడుతున్నాయి. ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే మంటలు క్షణాల్లో వ్యాప్తిచెంది స్పందించే లోపే ఘోరం జరిగే ప్రమాదముంది. కొద్దిపాటి నిర్లక్ష్యంతో ఆస్తి, ప్రాణ నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. అత్యాధునిక యంత్ర పరిజ్ఞానంతో కట్టెల, కుంపటి పొయ్యిల నుంచి గ్యాస్ వినియోగం వరకూ ఎంతో సౌకర్యం ఉన్నా దాని వెనుకే ప్రమాదం పొంచి ఉంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా క్షణాల్లోనే అంతా బూడిదై కళ్ల ముందు కనిపిస్తుంది. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటూనే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టింది అగ్నిమాపక శాఖ. విద్యాసంస్థలు, పరిశ్రమలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించింది.

మార్కాపురం: వేసవి వచ్చిందంటే ప్రతి ఒక్కరికీ భయమే ఎక్కడ అగ్నిప్రమాదం జరుగుతుందోనని. అందరూ అప్రమత్తంగా ఉన్నా చిన్నపాటి నిర్లక్ష్యంతో తరచుగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏప్రిల్ రెండో వారంలో అగ్నిప్రమాదాల నివారణే లక్ష్యంగా అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలు, స్కూల్స్, హాస్పిటల్స్, గ్యాస్ గోడౌన్‌లు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, అపార్ట్‌మెంట్లు, సినిమా హాల్స్, విద్యుత్ శాఖ కార్యాలయాలు, కళాశాలలో, పెట్రోల్ బంక్‌లలో తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, డెమోలు నిర్వహించారు. జిల్లా అధికారులు తీసుకుంటున్న చర్యలతో ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఆస్తి నష్టం సైతం తగ్గించేలా చేశారు. గడిచిన నాలుగేళ్ల గణాంకాలు పరిశీలిస్తే..

జిల్లా వ్యాప్తంగా 2,285 అగ్నిప్రమాదాలు సంభవించాయి. వీటి వల్ల సుమారు రూ.32,45,57,364 నష్టం వాటిల్లింది. సకాలంలో స్పందించడంతో రూ.69,92,00,746 విలువైన ఆస్తిని కాపాడారు.

జిల్లాలో 10 అగ్నిమాపక కేంద్రాలు:
ఒంగోలు, మార్కాపురం, టంగుటూరు, కొండపి, కనిగిరి, కంభం, గిద్దలూరు, వైపాలెం, దోర్నాల, దర్శిలలో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. పది అగ్నిమాపక వాహనాలతో పాటు ఒంగోలు నగరంలో అత్యాధునిక వాహనం కూడా అందుబాటులో ఉంది. ప్రమాదం జరిగిందన్న సమాచారం తెలిసిన వెంటనే సిబ్బంది, వెళ్లి మంటలను అదుపులోని తీసుకొస్తున్నారు.

ప్రమాదాలకు కారణాలు:
నాణ్యమైన విద్యుత్ పరికరాలు వాడకపోవడం, ఎలక్ట్రికల్ వైరింగ్ జాయింట్ ఊడిపోవడం, చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు అందుబాటులో ఉంచడం, కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు చల్లార్చకుండా పక్కన పడేయడం. వంటింట్లో గ్యాస్ లీకవుతున్నా గమనించకపోవడం, మండుతున్న స్టౌవ్‌లో కిరోసిన్ పోయడం, ఇలాంటి వాటి వల్ల అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి.

సంవత్సరం	సీరియస్	మీడియం	స్మాల్	ఆస్తి నష్టం రూ.కోట్లలో	కాపాడిన ఆస్తి రూ.కోట్లలో
2019-20	9	43	609	9,51,16,500	13,43,04,000
2020-21	5	43	729	9,55,97,600	20,70,65,000
2021-22	4	31	442	8,00,06,500	22,44,51,500
2022-23 (ఫిబ్రవరి వరకు)	3	37	330	5,40, 31,754	13,53,80,246

నివారణ ఇలా



అగ్నిప్రమాదాల నివారణపై ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలో సురక్షితమైన విద్యుత్ పరికరాలను వాడాలి. ఎలక్ట్రిక్ పాయింట్లలో ఓవర్‌లోడ్ వద్దు. కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పివేసి యాష్ ట్రేలో వేయాలి. గోడౌన్‌లు, ఫ్యాక్టరీలో, గ్యాంగ్ వే, క్రాస్ సెక్షన్‌లు ఉంచాలి. మండే స్వభావం గల డస్ట్ చేరకుండా చూసుకోవాలి. ఫైర్ అలారమ్, స్మోక్ డిటెక్టర్లను, ఆటోమేటిక్ స్ప్రింక్లర్లను ఉపయోగించుకోవాలి. నీటి సౌకర్యం అందుబాటులో ఉంచుకోవాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం అందించండి. - **వేణుగోపాలరావు**, అగ్నిమాపక శాఖాధికారి, ఒంగోలు

ప్రజలకు అవగాహన కల్పించాం

వారం రోజుల పాటు మార్కాపురం ప్రాంతంలో అగ్నిమాపక శాఖ వారోత్సవాలు నిర్వహించి ప్రమాదాలు ఎలా జరుగుతాయి, ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించారు. డెమో కూడా చేసి చూపించారు. వేసవి వెళ్లేంత వరకు అందరూ జాగ్రత్తగా ఉండాలి.

- వెంకట్రావు, ఫైర్ ఆఫీసర్ మార్కాపురం

సంక్షేమ పథకం మిస్ కాకూడదు

- ప్రజల సంక్షేమం కోసం అవసరమైతే కొత్త పథకాలు
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి



కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: అర్హత ఉన్న ఏ ఒక్కరికీ సంక్షేమ పథకం మిస్ కాకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో శనివారం 34వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలతలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాజీవ్ నగర్ మెయిన్ రోడ్డు, ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. గద్దలగుంట వార్డు సచివాలయానికి సంబంధించి 34వ డివిజన్ పరిధిలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా బాలినేని అడిగి తెలుసుకున్నారు. గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకం కావాలంటే కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థల వలన గడప ముంగిటకే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకం వచ్చిచేరుతోందన్నారు. ప్రజలకు అవసరమైతే కొత్తగా సంక్షేమ పథకాలు పెట్టటానికి కూడా సీఎం వైఎస్ జగన్ వెనకాడడన్నారు. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో సామాన్యుల వైద్య అవసరాల కోసం ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రవేశ పెట్టారని చెప్పారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం కోసం కూడా పశువైద్య సంచార వాహనాలను కూడా ప్రారంభించి ఆదుకుంటున్నారన్నారు. సాయంత్రం 32వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాలినేని సతీమణి శచీదేవి పాల్గొన్నారు. మామిడిపాలెం మూడు బొమ్మల సెంటర్‌లోని విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించిన శచీదేవి ఆ ప్రాంతంలో పర్యటించారు. అనంతరం పార్టీ నాయకుడు నత్తల బీమేష్ నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విరివిగా పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమీషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 34వ డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, మహిళా విభాగం జిల్లా పార్టీ అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ఎందేటి పద్మావతి, ట్రేడ్ యూనియన్ నాయకులు పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరి రవిచంద్ర, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, గోలి తిరుపతిరావు, నక్కల లీలా కుమారి, మీరావలి, మోదుబోయిన సురేష్, బేతంశెట్టి హరిబాబు, డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు 32వ డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు కోసూరి శేఖర్, 34వ డివిజన్ అధ్యక్షుడు తోటపల్లి సోమశేఖర్, కొల్లా అశోక్, బడుగు ఇందిర, చిట్టెం సురేష్, మన్నేపల్లి అంకబాబు, జువ్విశెట్టి వెంకట్రావు, నత్తల బీమేష్, గాజుల సాయి, ఓగిరాల వెంకట్రావు, తోటపల్లి వెంకటేష్, గరికపాటి గోపాల కృష్ణ,తో పాటు పలువురు పాల్గొన్నారు.

ముస్లింలకు మంత్రి సురేష్ రంజాన్ శుభాకాంక్షలు

యర్రగొండపాలెం: రంజాన్ పండుగ సందర్భంగా స్థానిక పెద్దమసీదు ఆవరణలో ఉన్న ఈద్గా వద్ద శనివారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానా హిదాయతుల్లా సందేశాన్ని ఇచ్చారు. ప్రార్థనలు ముగిసిన తరువాత రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఈద్గా వద్దకు చేరి ముస్లింలతో ఆలింగనం చేసుకొని వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల పార్టీ అధ్యక్షులు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్‌లు ఆరుణాబాయి, సుబ్బారెడ్డి. నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



వైపాలెంలో మౌలానా హిదాయతుల్లాతో ఆలింగనం చేసుకుంటున్న మంత్రి ఆదిమూలపు సురేష్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతిచెందిన నాగిరెడ్డి

మద్దిపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వెల్లంపల్లి వద్ద శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గాజులపాలెం గ్రామానికి చెందిన బడే నాగిరెడ్డి తన భార్య, ముగ్గురు అన్న బిడ్డలతో మోటార్‌సైకిల్‌పై ఒంగోలు వెళ్తూ అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనున్న గ్రిల్స్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.

అత్యవసర సేవలకు ఇకపై టోల్ ఫ్రీ నంబర్ 112

ఒంగోలు: అత్యవసర సేవలకు ఇకపై టోల్ ఫ్రీ నంబర్ 112 కు ప్రజలు డయల్ చేయాలని ఎస్పీ మలికాగర్గ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అత్యవసర సమయాల్లో తక్షణ రక్షణ సహాయం కోసం ఈ నంబర్‌ను కేంద్రం అమలులోకి తెచ్చిందన్నారు. ఇప్పటి వరకు పోలీసు–100, ఫైర్–101, ఆరోగ్యం–108, రైల్ మిత్ర–139 వంటి వివిధ అత్యవసర సేవలకు వేర్వేరు నంబర్లు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ ఏకీకృతం చేస్తూ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్టు సిస్టమ్ (ఈఆర్ఎస్ఎస్) ను బలోపేతం చేయడం ద్వారా 112 నంబర్ అందుబాటులోకి వచ్చిందన్నారు. స్మార్ట్ ఫోన్‌లో పవర్ బటన్‌ను మూడుసార్లు వెంట వెంటనే నొక్కినా కూడా హెల్ప్‌లైన్‌కు సమాచారం అందుతుందని, కీప్యాడ్ ఫోన్లలో 5 లేదా 9 అంకెను లాంగ్ ప్రెస్ చేయడం ద్వారా కూడా ఈసేవలు పొందవచ్చన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- కంభం మండలంలో 120 ఎకరాల్లో నేలకొరిగిన అరటి తోటలు
- రూ.కోటికి పైగా నష్టం
- ఆందోళనలో రైతులు


చిన్నకంభం గ్రామంలో పూర్తిగా నేలకొరిగిపోయిన పాపచెన్నారెడ్డికి చెందిన రెండెకరాల అరటి తోట

కంభం: ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా బలంగా వీచిన గాలులకు కంభం మండలంలోని గ్రామాల్లో సాగులో ఉన్న అరటి తోటలు నేలకొరిగిపోయాయి. ఆ రైతులంతా తీవ్రంగా నష్టపోయారు. కంభం చెరువు ఆయకట్టు కింద కంభం, చిన్నకంభం, పోరుమామిళ్లపల్లి, హజరత్‌గూడెం, చింతలపాలెం గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు ప్రకారం 263 ఎకరాల్లో అరటి సాగులో ఉంది. అందులో సుమారు 120 ఎకరాల్లో పెనుగాలులకు పంట నష్టం జరిగింది. మరికొందరు రైతులు అవగాహన లేక ఈ క్రాప్‌లో పంట నమోదు చేసుకోలేదని తెలుస్తోంది. చిన్నకంభం, పోరుమామిళ్ల పరిధిలో పది ఎకరాల్లో పూర్తిగా అరటి చెట్లు నేలకొరిగిపోవడంతో సంబంధిత రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం శ్రమించి సాగుచేస్తున్న అరటి తోటలు మరో రెండుమూడు నెలల్లో కాపుకు వచ్చి తాము పెట్టిన పెట్టుబడితో పాటు లాభాలు కురిపిస్తాయనుకుంటున్న తరుణంలో పెనుగాలులు తీవ్ర నష్టం కలిగించాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి పంట సాగుచేసుకున్నామని, పంట నష్టం జరగడంతో పాటు ప్రస్తుతం పడిపోయిన చెట్లను తొలగించి పొలం బాగుచేసుకోవాలంటే ఎకరాకు రూ.20 వేలు ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు.



చెట్లన్నీ నేలకొరిగాయి : ఐదు ఎకరాల్లో అరటి తోట సాగు చేస్తున్నా. శుక్రవారం వీచిన గాలులకు మూడు వంతుల చెట్లు నేలకొరిగాయి. రూ.5 లక్షల మేరకు నష్టం వాటిల్లింది.
షేక్ వహీద్, బాధిత రైతు



తీవ్రంగా నష్టపోయాను : పోరుమామిళ్లపల్లి గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని మూడు ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నా. పూత దశలో ఉన్న అరటి గెలలు శుక్రవారం వీచిన గాలులకు మొత్తం నేలకొరిగిపోవడంతో తీవ్రంగా నష్టం జరిగింది.
బాషా, బాధిత రైతు



పది నిముషాల్లోనే చెట్లన్నీ పడిపోయాయి : శుక్రవారం వీచిన గాలులకు చూస్తుండగానే పది నిముషాల్లోనే చెట్లన్నీ నేలకొరిగిపోయాయి. కాపు దశలో ఉన్న నా ఎకరా అరటి తోటకు మందు వేద్దామని తెచ్చి పెట్టుకున్నాను. ఈలోపే ఇలా జరిగింది.
వెంకట సుబ్బమ్మ, బాధిత రైతు



పంట చేతికొచ్చే సమయంలో బాధాకరం : చిన్నకంభంలో రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని అరటి తోట వేశా. గెలలు కాపుకు వస్తుండటంతో రెండు రోజుల క్రితమే 12 బస్తాల మందు వేశా. గాలులకు చెట్లు మొత్తం గెలలతో సహా పడిపోయాయి.
పాప చెన్నారెడ్డి, బాధిత రైతు

ఉరుములు, మెరుపులకు బెంబేలెత్తిన ప్రజలు


గాలికి లేచిపడిన రేకులు

గిద్దలూరు రూరల్: ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులకు మండలంలోని ప్రజలు బెంబేలెత్తిపోయారు. వీటికితోడు తేలికపాటి వర్షం కూడా పడి మండలంలోని తిరుపతిపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి బీభత్సం సృష్టించింది. గ్రామంలోని రాజాక్రిష్ణకు చెందిన రేకుల షెడ్డు గాలులకు పూర్తిగా లేచిపోయింది. ఎడ్ల షెడ్డుకు రేకులు లేచి ఎడ్ల మీద, రాజాక్రిష్ణ కుటుంబ సభ్యుల మీద పడటంతో గాయాలయ్యాయి.

పిడుగుపాటుకు 19 జీవాలు మృతి


జీవాలు మృతి

పెద్దారవీడు: మండలంలో ఏనుగులదిన్నెపాడు పంచాయతీ కర్రోల గ్రామంలో శుక్రవారం రాత్రి పిడుగు పడటంతో 19 గొర్రెలు, మేకలు మృతి చెందినట్లు బాధితుడు కోనంగి పాలంకయ్య తెలిపాడు. జీవాల విలువ దాదాపు రూ.1.50 లక్షలు ఉంటుందని వెల్లడించాడు. కర్నూలు–గుంటూరు రహదారిపై సానికవరం గ్రామ సమీపంలో శివరామకృష్ణ మందిరం వద్ద ఈదురుగాలులకు చెట్టు విరిగి నడిరోడ్డుపై పడింది. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. అధికారులు స్పందించి చెట్టును తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు


సానికవరం సమీపంలో విరిగి రోడ్డుపై పడిన చెట్టు

కుప్పకూలిన 15 విద్యుత్ స్తంభాలు


విద్యుత్ స్తంభం వద్ద పనులు చేస్తున్న సిబ్బంది

కొమరోలు: మండలంలో శుక్రవారం సాయంత్రం వీచిన బలమైన గాలులకు పలు గ్రామాల్లో 15 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తాటిచెర్ల గ్రామ సమీపంలో ఒక విద్యుత్ స్తంభం విరిగిపోయి నేలకొరగ్గా, ముత్రాసుపల్లెలో 1, ముక్తాపురంలో 1, ఇడమకల్లులో 2, కొమరోలులో 1, పోసుపల్లెలో 2, క్రిష్ణంపల్లెలో 1, సూరవారిపల్లెలో 2, భావాపురంలో 1, రామావారిపల్లెలో 1, మొట్టుపల్లెలో 1, నల్లగుంట్లలో 1 చొప్పున మొత్తం 15 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని వివరించారు. దీనివలన విద్యుత్ శాఖకు రూ.1.5 లక్షల ఆస్తి నష్టం సంభవించిందన్నారు. యుద్ధప్రాతిపదికన విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి నెలకొల్పి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్


పొదిలి: రంజాన్ ప్రార్థనలకు తరలిన ముస్లింలు


టంగుటూరు ఈద్గా వద్ద..

జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఇప్పటి దాకా చేసిన ఉపవాస దీక్షలకు స్వస్తి చెప్పి అల్లాను ప్రార్థించారు. పేదలకు దానధర్మాలు చేసి వారికి కూడా ఆనందాన్ని పంచిపెట్టారు.
–సాక్షి, ఒంగోలు


ఈద్గా వద్ద కళ్లకు సుర్మా పెట్టించుకుంటున్న ముస్లిం యువకులు


కంభంలో ర్యాలీగా..


పామూరులో ఈద్గా వద్ద ..


పుల్లల చెరువులో..


ఎమ్మెల్యే, రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి ఆ ధ్వర్యంలో ఈద్గా మైదానం వద్ద వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్, బాదంపాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు


మద్దిపాడులో ముస్లిం సోదరులు


ఒంగోలులో సామగ్రి విక్రయం..

ఉసురు తీసిన ఈత సరదా

- నీటిలో మునిగి ఉత్తరప్రదేశ్ వాసి మృతి


శంకర్ కుష్వాహ మృతదేహం

నాగులుప్పలపాడు: బతుకుదెరువు కోసం వచ్చి సరదాగా ఈత కొడదామని నీటిలో దిగిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తూ మునిగిపోయి మృతిచెందిన సంఘటన శనివారం సాయంత్రం మండలంలోని ఉప్పుగుండూరు సమీపంలో నాగన్నవాగు చెక్ డ్యాం వద్ద చోటుచేసుకుంది. నాగులుప్పలపాడు పోలీసులు అందించిన సమాచారం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శంకర్ కుష్వాహ (42) చీమకుర్తి మండలంలోని పల్లామల్లి గ్రామంలో పానీపూరీ బండి నడుపుతున్నాడు. శనివారం చిన్నగంజాంలో మరో బండి పెట్టడానికి అనువైన ప్రదేశం వెతకడానికి తన మేనల్లుడితో కలిసి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఉప్పుగుండూరు వద్ద చెక్‌డ్యాంలో నీరు బాగా ఉండటంతో ఈత కొట్టి స్నానం చేయడానికి నీటిలో దిగాడు. అతని మేనల్లుడు ఒడ్డునే ఉన్నాడు. ఈ క్రమంలో చెక్‌డ్యాంలో నీటి లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయి శంకర్ కుష్వాహ ప్రాణాలు కోల్పోయాడు. ఆ మేరకు ఎస్సై హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాబు మాటలకు జనం నవ్వుకుంటున్నారు

- అక్టోబర్‌లో వెలిగొండను ప్రారంభించనున్న సీఎం జగన్
- వెలిగొండపై చంద్రబాబు అబద్ధపు మాటలు
- సహచర ఎమ్మెల్యేలు, మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: ఈ ఏడాది అక్టోబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తుంటే, 14 ఏళ్లపాటు సీఎంగా ఉండి వెలిగొండ పేరును మరచిపోయిన చంద్రబాబు పశ్చిమ ప్రకాశం పర్యటనలో వెలిగొండను తానే పూర్తి చేస్తానని చెప్పిన మాటలు విన్న ప్రజలు నవ్వుకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. శనివారం మార్కాపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఇక్కడికి వచ్చి ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడారని, ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారన్నారు. 1995లో తనతో పాటు అప్పటి ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు చప్పిడి వెంగయ్య, రాంభూపాల్ రెడ్డి, పగడాల రామయ్య, కరణం బలరాం, గరటయ్య, తవనం చెంచయ్య, దగ్గుపాటి వెంకటేశ్వరరావు తదితరులు వెలిగొండ ప్రాజెక్టు విషయమై చంద్రబాబును కలిస్తే నీళ్లు, నిధులు లేవంటూ చెప్పారన్నారు. 1996లో బై ఎలక్షన్ రావటంతో ఓట్ల కోసం 96 మార్చి 3న గొట్టిపడియ వద్ద హడావుడిగా శంకుస్థాపన చేసిన చంద్రబాబు నిధులు ఇవ్వలేదన్నారు. 1997లో అప్పటి ప్రధాని వాజ్‌పాయ్, కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడిని సహచర శాసనసభ్యులతో కలిసి వెలిగొండకు నిధులివ్వాలని కోరామన్నారు. 1999లో తన అనుచరుడు, బినామీ బీటెక్ రవి కోసం కాంట్రాక్టు ఇచ్చారని చెప్పారు. 2004లో సీఎంగా వైఎస్‌ఆర్‌ను కలిసి వెలిగొండ గురించి విజ్ఞప్తి చేయగా ఆయన జీవో విడుదల చేసి నిధులు కేటాయిస్తూ సుంకేసుల వద్దకు వచ్చి పనులు ప్రారంభించారన్నారు. 2009 నాటికే వెలిగొండ పనులు చాలా వరకు పూర్తయ్యాయని చెప్పారు. 2014లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పటి నుంచి 2019 వరకు వెలిగొండపై పూర్తి నిర్లక్ష్యంగా ఉండి ఇప్పుడు ఇక్కడికి వచ్చి వెలిగొండను పూర్తి చేస్తామని చెప్పడాన్ని చూస్తుంటే ఈ ప్రాంత ప్రజలు ఆయనకు అమాయకుల్లాగా కనిపిస్తున్నారా అని జంకె ప్రశ్నించారు. ఆయన హయాంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేయకుండా మళ్లీ తనను గెలిపిస్తే, మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను 1994 నుంచి 99 వరకు ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో చాలా సార్లు మార్కాపురం జిల్లా కావాలని వినతిపత్రాలు ఇచ్చామన్నారు.

ఎమ్మెల్యేలపై అనవసరపు విమర్శలు

చంద్రబాబు తన పర్యటనలో గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, నాగార్జునరెడ్డి, మంత్రి సురేష్‌పై విమర్శలు చేయటం సరికాదన్నారు. సహచర శాసనసభ్యులను చూడకుండా నోటికొచ్చినట్లు మాట్లాడిన చంద్రబాబు తీరును ప్రజలు గమనిస్తున్నారని, ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నారన్నారు. సీఎంను సైకో అంటూ మాట్లాడటం పద్ధతి కాదని, సైకో ఎవరో ప్రజలే నిర్ణయిస్తారని, వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలతో పాటు 175 స్థానాల్లో కూడా వైఎస్ఆర్ సీపీ అభ్యర్థులు గెలుస్తారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే చంద్రబాబు పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రెస్‌మీట్‌లో పార్టీ నాయకులు మందటి మహేశ్వరరెడ్డి, పంబి వెంకటరెడ్డి, జంకె వెంకటనారాయణరెడ్డి, గాంధీరెడ్డి, రమణారెడ్డి, శివారెడ్డి, రామకృష్ణరెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

HIGH COURT OF ANDHRA PRADESH:: AT AMARAVATI
I.A. No. 1 of 2023 in S.A.No. 1715 of 2018

Between: -
Burka Anka Raju S/o. Venkateshwarlu, Aged about 44 years, Hindu, Occ : Cultivation, R/o. Konejedu Village, Tangutur Mandal, Prakasam District. .... **Petitioner/Appellant**
And
Kolli Ankamma (Died) and others.

In the S.A.No. 1715 of 2018, on 14-12-2018, the Hon'ble Court was pleased to order Personal Notice to you i.e., the respondent No.9 i.e., Punugumati Chenchu Ramaiah and posted the case on 18-12-2018. As per order of the Hon'ble High Court, the previous counsel sent personal notice to the respondent No.9, i.e., **Punugumati Chenchu Ramaiah, S/o Chinnabbi, Aged about 46 years, Hindu, Occ: RTC Driver, R/o. Rajiv Nagar II lane, Ongole, Prakasam District** and same is returned unserved earlier with endorsement "Insufficient Address". Again on 03-11-2022, the Hon'ble High Court was pleased to order personal notice to Respondent No.9 in I.A.No. 1 of 2022 in S.A.No. 1715 of 2018 and posted the matter after 4 weeks. As per order of the Hon'ble Court, I sent personal notice to Respondent No.9 on 23-11-2022 and the same is returned with endorsement "He was present in Bangalore, Hence return, I send". The petitioner/Appellant filed I.A. 1 of 2023 in S.A.No. 1715 of 2018 seeking permission substituted service by publication in daily local newspaper Vishalaandhra or any newspaper in Prakasam District against Respondent No.9 i.e, Punugumati Chenchu Ramaiah in IA No. 1 of 2022 in S.A.No.1715 of 2018. On 20-03-2023, the Hon'ble Court was pleased to permit me to take out substituted service in Telugu daily newspaper (Saakshi) in Prakasam District edition and the same is listed on 20-04-2023 and later posted on 11-05-2023 on my request.

PENJURI VENUGOPAL, Advocate-High Court
Counsel for Appellant. Cell : 99496 97763

వైరల్

అమ్మాజీ... కదిలించావు!

ఒక సిటీలో ఒక మహిళ రోడ్డు పక్కన ఎండలో కూర్చుని బఠాణీలు అమ్ముతోంది. ఈ దృశ్యం పవన్ కౌశిక్ అనే ట్విట్టర్ యూజర్ కంట్లో పడింది. 'ఈ వయసులో ఎండలో కూర్చొని కష్టపడుతోంది' అని జాలిపడి బేరం ఆడకుండా ఆమె దగ్గర ఉన్న బఠాణీల సంచులను హోల్‌సేల్‌గా కొనేశాడు.



ఆమెతో సెల్ఫీ దిగి తన సంతోషాన్ని ట్విట్టర్‌లో షేర్ చేశాడు. 'అమ్మాజీకి సహాయపడినందుకు సంతోషంగా ఉంది' అంటూ రాశాడు.

ఈ ట్వీట్ వైరల్ కావడం మాట ఎలా ఉన్నా యూజర్స్ మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం వారు 'చాలా మంచి పనిచేశారు' అని ప్రశంసిస్తే మరో వర్గం మాత్రం 'చేసిన మంచి పని చెప్పుకోకూడదు. పబ్లిసిటీ ఎందుకు!' అంటూ ఘాటుగా విమర్శించారు. ఆ విమర్శలకు పవన్ కౌశిక్ ఇలా స్పందించాడు.. 'నేను చేసింది చాలా చిన్న పని అనే విషయం, ఆ సహాయం వల్ల అమ్మాజీ జీవితం మారదనే విషయం నాకు తెలుసు. అయితే ఈ పని నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఆ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది'

అయ్ బామ్మోయి!

సంప్రదాయ దుస్తుల్లో బామ్మలు వీధుల్లో స్కేట్‌బోర్డింగ్ చేస్తున్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఇది నిజం కాదు. బామ్మలు నిజమే. స్కేట్‌బోర్డింగ్ మాత్రం ఏఐ సృష్టి!



ఆశిష్ జోస్ అనే ఆర్టిస్ట్ ప్రాంప్ట్–బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్ 'మిడ్‌జర్నీ'ని ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించాడు.

'స్కేటింగ్ నానీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మూడు రోజుల వ్యవధిలోనే 1.17 లక్షల వ్యూస్ వచ్చాయి. 'సాహసానికి వయసు అడ్డు కాదు'లాంటి ఎన్నో కామెంట్స్ కనిపించాయి.

జై శ్రీ అన్నా

గతంతో పోల్చితే చిరుధాన్యాల పెద్ద ఉపయోగాల గురించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా విస్తృత అవగాహన పెరిగింది. దీనికి సాక్ష్యంగా నిలిచే వీడియోను ప్రధానమంత్రి నరేంద్రమోదీ షేర్ చేశారు.



'వైబ్రెంట్ విలేజెస్' కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఒక గ్రామంలోకి వెళ్లారు.

ఆ గ్రామంలోని ఒక మహిళ మంత్రిగారికి చిరుధాన్యాలతో చేసిన సంప్రదాయ వంటల రుచి చూపించడమే కాదు... జొన్నె రొట్టె నుంచి రాగి లడ్డు వరకు చిరుధాన్యాలు చేసే మంచి గురించి మంచిగా మాట్లాడింది. ప్రధాని ప్రశంస అందుకొంది.

'ప్రతి పల్లెలో ఇలాంటి దృశ్యం కనిపించాలి'... 'క్షేత్రస్థాయి నుంచి మొదలైన స్పృహ, చైతన్యం వేగంగా విస్తరిస్తుంది'... 'కనుల విందు చేసే వీడియో'... ఇలాంటి కామెంట్స్ కనిపించాయి.

స్వీట్‌వాయిస్ చిట్టెమ్మ!

పియానో వాయిస్తూ ఒక మహిళతో కలిసి కన్నడ పాట పాడుతున్న చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వీర లెవల్లో వైరల్ అయింది. అనంత్ కుమార్ అనే యూజర్ ఈ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు. పాడుతున్న సమయంలో చిన్నారి ప్రదర్శించిన హావభావాలకు నెటిజనులు ఫిదా అయ్యారు. 'ఆహా' అంటూ అబ్బురపడ్డారు.



'పక్కనే తీయటి సెలయేరు పారుతున్నట్లుగా ఉంది' 'మ్యాజిక్ వాయిస్ ప్లస్ బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషన్స్' లాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

నిజానికి ఆన్‌లైన్ ప్రేక్షకులకు ఈ చిన్నారి గొంతు కొత్తేమీ కాదు. గత సంవత్సరం బాలీవుడ్ సినిమా 'కబీర్‌సింగ్' సినిమాలోని 'కైసే హువా' పాటను అద్భుతంగా పాడింది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

పల్లో లట్కే

డ్యాన్సింగ్ వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ కావడం అనేది కొత్త విషయమేమీ కాదు. అయితే అమ్మాయిల బృందం చేసిన ఈ డ్యాన్స్ వీడియో వారం రోజుల వ్యవధిలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ వ్యూలను సొంతం చేసుకుంది. 'అసలు కంటే కాపీ ముద్దు' అనే సామెత లేదుగానీ ఈ వీడియో క్లిప్ చూస్తే అలాగే అనిపిస్తుంది.



'షాదీ మే జరూరు ఆనా' అనే హిందీ సినిమాలోని 'పల్లో లట్కే' సాంగ్‌కు ఈ యువబృందం వేసిన స్టెప్పులు 'అహా' అనిపించాయి.

'ఏబీసీడీ డ్యాన్స్ ఫ్యాక్టరీ' ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'అప్పుడెప్పుడో పెళ్లిసంబరాల్లో డ్యాన్స్ చేసేదాన్ని. ఈ వీడియో చూస్తుంటే...నా మోకాల నొప్పులను పక్కనపెట్టి డ్యాన్స్ చేయాలని ఉంది' అని కామెంట్ పెట్టింది 69 సంవత్సరాల రాధాబాయి.

వీడియో తెగ వైరల్ అయిందని చెప్పడానికి ఇంతకు మించిన కామెంట్ అక్కర్లేదేమో!

పాటల తుపాకీ...

దేశ సరిహద్దులో బీఎస్ఎఫ్ జవాన్. వేదికల మీద పాటలు పాడుతూ తనలో ఉన్న కళకు హద్దులు లేవని నిరూపిస్తున్నారు. 'డ్యూటీలో ఉంటూ గాన సాధన కూడా చేయడంతో ఈ పాట నాకు బాగా వంట పట్టింది' అంటూ ఇటీవల హైదరాబాద్ వచ్చిన చక్రపాణి నగరి తన గురించి వివరించారు.


చక్రపాణి నగరి

''మాది శ్రీకాకుళం జిల్లా, పలాస. టెన్త్‌క్లాస్ వరకు హైదరాబాద్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో బీఎస్ఎఫ్‌కు సంబంధించిన ఒక ప్రకటన చూసి, అప్లై చేశాను. ఆ పరీక్షల్లో సెలక్ట్ అయ్యి 2013లో బీఎస్ఎఫ్‌లో చేరాను. ఇప్పటి వరకు రాజస్థాన్‌లో పని చేశాను. ఇప్పుడు సెలవు మీద హైదరాబాద్‌కు వచ్చాను. సెలవు పూర్తవగానే జమ్ములో విధులు నిర్వర్తించాలి.

డ్యూటీలో ఉంటూ..

ఏదో ఒకటి పాడుకుంటూ ఉండటం అనేది స్కూల్ టైమ్ నుంచే ఉండేది. కానీ, ఎప్పుడూ దానిని నా డ్రీమ్ ప్రాజెక్ట్ అనుకోలేదు. బీఎస్ఎఫ్‌లో చేరిన తర్వాత అక్కడ మా టీమ్, క్యాంపుల్లో సరదాగా పాడుతుండేవాడిని. నెలకు ఒకసారి ఏదో ఒక సెలబ్రేషన్ ప్రోగ్రామ్ జరుగుతుంటుంది. ఆ సమయంలో అన్నీ హిందీ పాటలు పాడేవాడిని. అక్కడున్నవారందరికీ హిందీ తెలుసు కాబట్టి, అవే పాటలు పాడేవాడిని. మా తోటి జవాన్‌లే కాదు ఆఫీసర్స్ కూడా చాలా ప్రోత్సహించేవారు. డ్యూటీలో ఉన్నా లేకున్నా పాటలు పాడటం మాత్రం ఆగేది కాదు. ఇక మా ఊరికి వచ్చినప్పుడు పెళ్లిళ్లు వంటి వేడుకల సందర్భాల్లోనూ నా గాన కచేరీ ఉండేది. ఖాళీ సమయంలో డిజిటల్ మీడియాని ఫాలో అవుతుంటాను. అలా, హైదరాబాద్‌లోని ఓ టీవీ పాటల కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని ప్రకటన చూసి, అప్లై చేసుకున్నాను. వేల మందిలో నాకు అవకాశం రావడంతో చాలా సంతోషంగా అనిపించింది. ఈ విషయాన్ని మా అధికారులకు చెబితే వాళ్లు వెంటనే ఓకే చేశారు. ఇక్కడ కార్యక్రమంలో పాల్గొనడమే కాదు, గాన గంధర్వుడు బాలుగారి మైక్‌ను కానుకగా అందుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది.

కష్టపడుతూ..

మా అమ్మానాన్నలకు మేం ముగ్గురం. నా చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో మా అమ్మ చాలా కష్టాలు పడింది. మమ్మల్ని హాస్టల్‌లో ఉంచి, తెలిసినవారి ద్వారా ఢిల్లీ వెళ్లి, పనులు చేసి, మాకు డబ్బు పంపేది. ఇప్పుడు అమ్మ ఊళ్లో వ్యవసాయం పనులు చేస్తుంది. అన్నయ్య సొంతగా బేకరీ నడిపిస్తున్నాడు. అక్క గ్రామవాలంటీర్‌గా చేస్తోంది. మాకు కష్టం విలువ తెలుసు, స్వయంగా ఎదగడానికి మా వంతుగా కృషి చేస్తూనే వచ్చాం. ఆ కష్టంలో నుంచే ఈ పాట పుట్టుకు వచ్చిందనుకుంటాను. ఎక్కడ ఉన్నా కళ రాణిస్తుందనడానికి నేనే ఉదాహరణ అనిపిస్తుంటుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని సింగర్‌గా రాణించాలనుకుంటున్నాను'' అని తెలియజేశాడు ఈ జవాన్.

– నిర్మలారెడ్డి

హెల్త్

బోన్ మ్యారో ఫెయిల్యూర్?



ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్లు... ఇలా రక్తంలోని కీలక కణాలకు పుట్టినిల్లు మూలుగ! కానీ అన్ని అవయవాల లాగే ఇది కూడా విఫలం కావచ్చు. హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్ లాగే బోన్ మ్యారో ఫెయిల్యూర్ కూడా జరగవచ్చునన్న మాట. ఈ ఫెయిల్యూర్‌ను వైద్యపరిభాషలో 'అప్లాస్టిక్ అనిమియా' అంటారు. గతంలో కాస్త అరుదే అయినా ఇటీవల ఈ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బోన్ మ్యారో ఫెయిల్యూర్ మీద అవగాహన కోసం ఈ కథనం.

నిజానికి మూలుగ వైఫల్యం కూడా ఓ ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే మన సొంత రోగనిరోధక శక్తి మన సొంత కణాలపై ప్రతికూలంగా ఏర్పడటం వల్ల వచ్చే వ్యాధి. దాంతో మూలుగ ప్రభావితమై, రక్తంలోని కణాల పుట్టుక, ఆరోగ్యకరమైన పెరుగుదల దెబ్బ తింటుంది. ఫలితంగా ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్ల కౌంట్ నార్మల్‌గా ఉండక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. 'అప్లాస్టిక్ అనిమియా' కండిషన్ ఏ వయసువారిలోనైనా, ఎప్పుడైనా రావచ్చు. సాధారణంగా చిన్న పిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఆసియావాసుల్లో అందునా మన దేశంలోనే ఈ కేసులు ఎక్కువ. దాదాపు 75 శాతం కేసుల్లో కారణాలు తెలియదు. అయితే మిగతా 25% కేసుల్లో ఈ కింది అంశాలు కారణం కావచ్చు.

కారణాలు : ● క్రిమిసంహారక మందులకు, ఆర్సెనిక్, బెంజీన్ వంటి విషపదార్థాలకు గురికావడం ● కొన్ని సందర్భాల్లో రేడియేషన్, కీమోథెరపీతో కూడా రావచ్చు ● రుమటాయిడ్ ఆర్థరైటిస్ లేదా లూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులకు తీసుకుంటున్న చికిత్సల వల్ల కూడా రావచ్చు ● హెపటైటిస్, కొన్ని ఇతర అరుదైన వైరస్‌లు ఎముక మజ్జ అణచివేతతో పాటు వైఫల్యానికి కారణం కావచ్చు ● హెపటైటిస్, ఎప్‌స్టెయిన్ బార్ వైరస్, సీఎంవీ వైరస్, పర్‌వైరస్ బి19 లేదా హెచ్ఐవీ వంటి సాంక్రమిక (ఇన్ఫెక్షియస్) వ్యాధుల తర్వాత కనిపించవచ్చు ● కొందరిలో వంశపారంపర్యంగా కూడా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు రావచ్చు. (ఇలా వంశపారంపర్యంగా ఈ జబ్బు వచ్చినప్పుడు మూలుగ మార్పిడి చికిత్స (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్) ఒక్కటే తగిన చికిత్స) ● మైలోడిస్‌ప్లాస్టిక్ సిండ్రోమ్ : ఇది రక్తానికి చెందిన ఒక రకం క్యాన్సర్‌కు ముందు దశ. ఈ సమస్య రాబోయే కొందరిలో ఇది హైపోసెల్యులార్ బోన్ మ్యారో అనే కండిషన్ (అంటే రక్తంలో ఉండే కణాల సంఖ్య తగ్గుదల)తో కనిపించవచ్చు ● పరోక్సిస్మల్ నాక్టర్నల్ హీమోగ్లోబినూరియా (పీఎన్‌హెచ్): మన మూలుగలో ఉండే కణాల్లోంచి తొలుత మూల కణాలు (స్టెమ్‌సెల్స్) పుడతాయి. అవి నిర్దుష్టంగా ఏయే కణాలు అంటే... ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఏయే పరిమాణాలతో ఎంత ఉండాలో అన్నిగా మారిపోతుంటాయి. కానీ 'పైగా' (పీఐజీ-ఏ) అనే ఓ జీన్ మ్యుటేషన్ (జన్యు ఉత్పరివర్తనం) కారణంగా రక్తకణాల్లో ఉండాల్సిన ఓ ప్రొటీన్ లోపించడంతో ఎర్రరక్తకణాలు విరిగిపోయినట్లుగా అవుతాయి. ఈ పరిణామాలు జరిగినప్పుడు ఎముక మజ్జలోని మూలకణాలు కూడా నాశనం అవుతాయి.

లక్షణాలు : అప్లాస్టిక్ అనిమియాతో ఎర్రరక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. ఫలితంగా ఈ కింది పరిణామాలు సంభవిస్తుంటాయి... ● ఎప్పుడూ నీరసం, నిస్సత్తువ ● చురుకుదనం లోపించడం. దేని పైనా దృష్టి కేంద్రీకరించలేకపోవడం ● ఆకలి తగ్గడం, బరువు తగ్గడం ● బాగా పాలిపోయినట్లుగా ఉండటం ● చిన్న చిన్న పనులకూ తీవ్రంగా ఆయాసం, గుండె వేగం పెరగడం ● మెట్లు ఎక్కలేకపోవడం. చిన్నపాటి వ్యాయామాలకూ తీవ్రంగా ఆయాసం ● చిన్నపాటి గాయం అయినా, తీవ్రమైన రక్తస్రావం ● తరచూ ఇన్ఫెక్షన్లతో పాటు జ్వరం

తెల్లరక్తకణాలు తగ్గడం వల్ల...

ఈ కండిషన్‌ను 'న్యూట్రోపీనియా' అంటారు. తెల్లరక్తకణాలు మన లోని వ్యాధినిరోధక శక్తికి తోడ్పడి ఇన్ఫెక్షన్లతో పోరాడతాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల తేలిగ్గా ఇన్ఫెక్షన్ల బారిన పడటం, తరచూ జ్వరం రావడం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ముఖ్యంగా మూత్రకోశం (బ్లాడర్) ఇన్ఫెక్షన్లకు గురి కావడం, మూత్రంలో మంట, మూత్రవిసర్జనలో నొప్పి, తరచూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో కష్టం, నోటిలో పుండ్లు, సైనస్ సమస్య, ముక్కు దిబ్బడ, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు కనిపిస్తుంటాయి. అప్లాస్టిక్ అనిమియా ఉన్నవారిలో జ్వరం చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించవచ్చు. చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కావచ్చు.

ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్ల... : ఏదైనా గాయం అయినప్పుడు రక్తస్రావాన్ని నిరోధించడానికి రక్తం గడ్డకట్టే ప్రక్రియకు ప్లేట్‌లెట్స్ తోడ్పడతాయన్న విషయం తెలిసిందే. అందుకే ఇవి లోపించినప్పుడు రక్తస్రావం ముప్పు ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గే కండిషన్‌ను 'థ్రాంబోసైటోపీనియా' అంటారు. దీనివల్ల చిన్న చిన్న గాయాలకే తీవ్రమైన రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం, చర్మం కింది పొర లో రక్తపు చుక్కల్లా ఎర్రమచ్చల్లాంటివి కనిపించడం, బ్రష్ చేసుకుంటున్నప్పుడు చిగుర్లు ఏమాత్రం దెబ్బతిన్నా తేలిగ్గా రక్తం వస్తుండటం, ఇక మహిళల్లోనైతే పీరియడ్స్ సమయంలో విపరీతమైన రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినప్పుడు అంతర్గత రక్తస్రావం కూడా కనిపించవచ్చు. ఈ కేసులో రక్తస్రావం కూడా ఓ మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించాలి. బయట రక్తస్రావం అవుతుంటే హాస్పిటల్‌కు చేరేవరకు రక్తస్రావాన్ని ఆపడానికి ప్రయత్నించాలి.

నిర్ధారణ: సరైన చికిత్స కోసం సమస్య ను సరిగ్గా నిర్ధారణ చేయడం అవసరం. ఇందుకు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి రొటీన్ బ్లడ్ వర్కప్స్, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష, బోన్ మ్యారో పరీక్షలు తోడ్పడతాయి.

చికిత్స : – చాలా స్వల్పమైన లేదా ఓ మోస్తరుగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో వారికి ఎలాంటి సమస్యా లేకపోతే తక్షణం పెద్దగా చికిత్స ఏదీ అవసరం ఉండదు. కానీ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో మాత్రం ముమ్ముందు రాబోయే దుష్పరిణామాలను నివారించడం కోసం చికిత్స అవసరం. ఇలాంటివారికి తరచూ రక్తం ఎక్కిస్తుండటం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), జ్వరం, ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించేందుకు యాంటీ ఫంగల్ మందులు ఇవ్వడం అవసరం.

ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ : మన రోగనిరోధక వ్యవస్థ అతి చురుగ్గా మారి సొంత కణాలపై ప్రతికూలంగా పనిచేస్తున్నందున ఈ సమస్య వస్తుంది కాబట్టి... ఆ ఇమ్యూనిటీ చురుకుదనాన్ని తగ్గించే ఏటీజీ, సైక్లోస్పోరిన్ వంటి వాటిని ఉపయోగించి కూడా ఈ సమస్యకు చికిత్స అందిస్తారు.

స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్ : ఈ చికిత్సలో అనారోగ్యకరమైన / సమస్యాత్మకమైన మూలుగ స్థానంలో ఇతరుల నుంచి (తమకు సరిపడే విధంగా / మ్యాచ్ అయ్యే విధంగా) ఉన్న ఆరోగ్యకరమైన దాత రక్తం నుంచి సేకరించిన మూలకణాలు మార్పిడి చేస్తారు. ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ లేదా ఇతరత్రా చికిత్సలు పనిచేయనప్పుడు, ఇదే మంచి ప్రత్యామ్నాయం. అయితే ఇందుకు దాత నుంచి సేకరించే మూల కణాలు జన్యుపరంగా స్వీకర్తతో సరిపోలాల్సి ఉంటుంది. అందుకే కుటుంబ సభ్యుల నుంచి సేకరించే మూలకణాలకు మొదటి ప్రాధాన్యం. ఇతరుల నుంచి సేకరించినప్పుడు అందులోని చాలా అంశాలు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. అయితే ఇదొక సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం హాస్పిటల్‌లో నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అవసరమవుతుంది. చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ సైడ్‌ఎఫెక్ట్స్ గురించి స్టెమ్‌సెల్ మార్పిడి నిపుణులతో చర్చించాకే ఈ చికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది.

సరికొత్త చికిత్స ప్రక్రియలు : పైన పేర్కొన్న చికిత్సలే కాకుండా ఇప్పుడు మరింత అత్యాధునికమైన 'ఎల్ట్రాంబోప్యాగ్', 'రోమిప్లాటిజమ్' వంటి నూతన చికిత్సలూ– అందుబాటులోకి వచ్చాయి. మూలుగ మార్పిడి చికిత్సకు అంత అనుకూలం కాని వారిలోనూ, ఇమ్యునోసప్రెసివ్ చికిత్సలకు అంతగా స్పందించని వారిలోనూ ఇవి మంచి ఫలితాలను తెస్తున్నాయి.


డా॥ గూడల స్థితప్రజ్ఞ
కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజీ & హెమటో ఆంకాలజీ అండ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్

మెడి టిప్

ఆహారంలో మార్పులతోనే నోటి దుర్వాసనకు అడ్డుకట్ట!



నోటి దుర్వాసనను వైద్యపరిభాషలో హాలిటోసిస్ అంటారు. మధుమేహం, గ్యాస్ట్రో ఇంటస్టినల్ జబ్బుల్లా అండర్‌లైయింగ్ డిసీజెస్ ఏవీ లేనప్పుడు కేవలం కొన్ని ఆహారాలు, ఆహారాల్లో మార్పులతో నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు. అదెలాగో చూద్దాం.

మన ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సమృద్ధిగా తీసుకోవడం, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగడం వల్ల నోటి దుర్వాసనను అదుపు చేసుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని పీచు పదార్థాలు గ్యాస్ట్రో ఇంటస్టినల్ మార్గాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుతాయి. ముఖ్యంగా ఆపిల్స్, క్యారట్స్ వంటి పీచు పదార్థాలు సమృద్ధిగా ఉన్న పండ్లు, కూరగాయలు నమిలి తినే ప్రక్రియలో అవి పళ్లను శుభ్రం చేస్తాయి. వీటిని తినడం వల్ల లాలాజలం ఎక్కువగా విడుదలై నోటిని శుభ్రంగా ఉంచుతుంది. తాజా పెరుగు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసనకు కారణమైన హైడ్రోజెన్ సల్ఫైడ్ అదుపులోకి వస్తుంది. చిగుళ్ల వ్యాధులూ తగ్గుతాయి.

మరికొన్ని చిట్కాలు... నోటి దుర్వాసనను అరికట్టడంలో కొత్తిమీర, పుదీనా, యాలక్కాయ వంటివి బాగా పని చేస్తాయి. ఆహారంతోపాటు లేదా నేరుగా వాడటం వల్ల కూడా నోటి దుర్వాసన తగ్గుతుంది. వాటిని నీటిలో మరిగించి ఆ టీని తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. దాంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. పాటించాక కూడా తగ్గకపోతే దంతాలు, చిగుర్లకు సంబంధించిన సమస్యగానీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

బ్లడ్ గ్రూపులు కలవకపోయినా కిడ్నీ మార్పిడి సాధ్యమే!

మూత్రపిండాలు నూరు శాతం పాడైపోయినప్పుడు కిడ్నీ మార్పిడి తప్ప మరొక ప్రత్యామ్నాయం ఉండదు. అయితే ఒక మూత్రపిండం ఉన్నప్పటికీ జీవితాంతం ఆరోగ్యంగానే బతకవచ్చు. కాబట్టి ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు దగ్గరి బంధువులైన కొందరి నుంచి కిడ్నీ స్వీకరించడానికి అనుమతి ఉంటుంది.

కిడ్నీని రెండు రకాలుగా స్వీకరించడం సాధ్యమవుతుంది. మొదటివి లైవ్ డోనార్ నుంచి. అంటే బతికి ఉన్న దగ్గరి బంధువుల నుంచి సేకరిస్తారు. ఇక రెండోది కెడేవర్ డోనార్... అంటే ఏదైనా ప్రమాదానికి గురైనవారి దేహం బతికి ఉండి, మెదడు చనిపోయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించినప్పుడు ఆ దాతను 'కెడేవర్ డోనార్'గా చెబుతారు. లైవ్ డోనార్స్ విషయంలో రక్తసంబంధీకులు మాత్రమే కిడ్నీని స్వీకరించే సమయంలో రక్తపరీక్షలు చేస్తారు. అయితే ఎంత దగ్గరి బంధువులైనప్పటికీ దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలిసినప్పుడే (మ్యాచ్) అయినప్పుడే కిడ్నీ ఇవ్వడం, తీసుకోవడం సాధ్యమవుతుంది. అంతేకాదు... కిడ్నీ దానం చేసేవారికి హైబీపీ, మధుమేహం (డయాబెటిస్), గుండెజబ్బులు, మెదడుకు సంబంధించిన జబ్బులు, కాలేయవ్యాధులైన హెపటైటిస్–బి, సి ఉండకూడదు. తన కిడ్నీ దానం చేసినప్పటికీ దాతకు ఎలాంటి నష్టం ఉండదని నిర్ధారణ చేశాకే కిడ్నీ మార్పిడి చేస్తారు.

అయితే రక్తసంబంధీకుల బ్లడ్ గ్రూపులు కలవకపోతే రెండు మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు వైద్యశాస్త్రంలో వచ్చిన ఆధునిక పురోగతి వల్ల బ్లడ్ గ్రూపులు కలవకపోయినప్పటికీ కిడ్నీ ఇవ్వవచ్చు. ఇది రెండు రకాలుగా జరుగుతుంది.

మొదటిది... స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రెండోది ఏబీఓ ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్.



స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్: ఇందులో రక్త సంబంధీకులకు కిడ్నీ దానం చేయాలని ఉన్నప్పటికీ... దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలవకపోవడం వల్ల అది సాధ్యపడనప్పుడు... అదే సమస్యతో బాధపడుతున్న వేరొకరి రక్త సంబంధీకులలో బ్లడ్ గ్రూపు సరిపడితే... వారి నుంచి కిడ్నీ స్వీకరించవచ్చు. ఇలా స్వీకరించినవారి రక్తసంబంధీకులు మళ్లీ వారికి తమ బంధువుల నుంచి కిడ్నీ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే... రక్తసంబంధీకులే కిడ్నీ ఇస్తారు గానీ... కేవలం బ్లడ్‌గ్రూపులు కలవకపోవడం చేత... ఇరువర్గాలు వారు ఎదుటివారికి కిడ్నీ ఇచ్చి పుచ్చుకుంటారు. ఈ విధానంలో వీరి కిడ్నీని వారి బంధువుకూ, వారి కిడ్నీని వీరి బంధువుకు అమర్చే ఏర్పాటు చేస్తారన్న మాట. అంటే తమ బంధువుకు సరిపడని గ్రూపు ఎదుటివారికి సరిపడనప్పుడు ఇలా చేస్తారు. ఈ ప్రక్రియలో బాధితులిద్దరి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఒకేసారి జరుగుతుంది. ఈ ప్రక్రియను 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు.

ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్: బ్లడ్ గ్రూపులు కలవనప్పటికీ ఇప్పుడున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిడ్నీ మార్పిడి చేయడం వీలవుతుంది. అయితే ఈ ప్రక్రియ కోసం కొన్ని నిర్దుష్టమైన పద్ధతులూ, కొన్ని ప్రత్యేకమైన మందుల్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా బ్లడ్‌గ్రూపు సరిపడకపోయినప్పటికీ జరిగే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్ని 'ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు. దీనిమీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఎలాంటి కిడ్నీ మార్పిడి అయినప్పటికీ... అది ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు, సూచనలకు అనుగుణంగానే జరగాల్సి ఉంటుంది.